క్లుప్తంగా

కుంభకోణంపై విచారణ చేయించాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో కోట్లాది రూపాయల కుంభకోణంపై విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. డీసీసీబీ అనుబంధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రూ.150 కోట్లు కుంభకోణం జరిగినట్లు మీడియా ద్వారా తెలుస్తుందని, ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

ఎర్రకాలువ మిగులు భూములు పంచాలి

ఏలూరు (టూటౌన్): ఎర్రకాలువ మిగులు భూములు భూమిలేని పేదలకు, ఆదివాసీలకు, దళితులకు ప్రభుత్వం ఇవ్వాలని, భూముల కోసం పోరాటం చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలపై నిర్బంధాన్ని వీడాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. ఫిబ్రవరి 27న ఎర్రకాలువ మిగులు భూములు భూస్వాముల నుంచి తీసుకొని అర్హులైన పేదల సాగుకు ఇవ్వాలని పోరాటం చేసిన వారిలో తొమ్మిది మందిపై భూస్వాములు కేసు పెట్టడాన్ని ఖండించారు. టి.నర్సాపురం మండలం సీపీఎం కార్యదర్శి టి.సత్యనారాయణను అరెస్టు చేసి షరతులపై విడుదల చేయడాన్ని తప్పుబట్టారు. ఎర్రకాలువ కోసం 35 సంవత్సరాల క్రితం అప్పటి భూ యజమానులు తమ భూములను ప్రభుత్వానికి అప్పజెప్పి నష్టపరిహారం తీసుకున్నారని గుర్తుచేశారు. ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు ఇవ్వడానికి అవకాశం లేదని చెబుతున్న ఇరిగేషన్ అధికారులు ఇప్పుడు భూస్వాములతో చలానాలు కట్టించుకొని ఆ భూముల్లో పామాయిల్, కొబ్బరి, కోకో, వరి వంటి పంటలు సాగుకు ఏ విధంగా అవకాశం ఇచ్చారని ప్రశ్నించారు.

దిశ యాప్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ ఆదేశాల మేరకు స్థానిక వన్‌టౌన్‌లోని శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ బోనం ఆదిప్రసాద్, ఎస్సై షేక్ మదీనా బాషా పాల్గొని విద్యార్థులకు దిశ యాప్, బాల్య వివాహాలు, డయల్ 100, 112,1098, ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు. ప్రధానోపాధ్యాయుడు హరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కబ్జా నుంచి నా స్థలాన్ని విడిపించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని నిడమర్రు మండలం బావాయిపాలెం గ్రామంలో తన స్థలాన్ని టీడీపీ నాయకు కబ్జా నుంచి విడిపించి తనకు అప్పగించాలని వినియోగదారుల హక్కుల ఉద్యమ నేత, వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య ఒక ప్రకటనలో కోరారు. తనకు న్యాయం చేయాలని నిడమర్రు, తాహసీల్దార్, ఎస్సైలకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదని, దీనిపై గత సోమవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు.

నర్సింగ్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని నర్సింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ కళాశాలలో పర్యటించగా విద్యార్థినులు అనేక సమస్యలను తమకు తెలిపారన్నారు. 2020 - 21లో ప్రారంభమైన బీఎస్సీ నర్సింగ్ క్లాసులకు రెగ్యులర్ ఫ్యాకల్టీ లేకపోవడం వల్ల చదువు కొనసాగించలేక ఇబ్బంది పడుతున్నామని, ప్రతి నెలా శానిటేషన్‌కు రూ.250, హాస్టల్‌కు రూ.2100 వసూలు చేస్తున్నా పరిశుభ్ర వాతావరణం లేదని, ఉడికీ ఉడకని భోజనం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారని వివరించారు. కాలేజి ఫీజు రూ. 20 వేలు కట్టించుకున్నారని, వాటిలో రూ. 7,500కు లెక్కా చెప్పడం లేదని, వెంటనే విచారణ చేయించి పరిష్కరించాలని నాని కోరారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు.. ప్రజల బెంబేలు

మధ్యాహ్నానికే రోడ్లపై నిర్మానుష్యం


ఎండకు నిర్మానుష్యంగా మారిన పవరుపేట స్టేషన్ రోడ్డు


ఎండలోనే మహిళ ప్రయాణం


నిర్మానుష్యంగా మారిన విజయవిహార్ సెంటర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రస్తుతం పెరుగుతోన్న ఉష్ణోగ్రతలు వేసవి ఎండలను తలపిస్తున్నాయి. వేసవి కాలం అప్పుడే వచ్చేసిందా అని నగర ప్రజలు వాపోతున్నారు. పగలు ఎక్కువగా ఎండలు, రాత్రి సమయంలో శీతాకాలం చాయలతో కొద్దిగా చలి వాతావరణంతో సతమతమవుతున్నారు. ఇటువంటి భిన్న వాతావరణంతో దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులు కూడా నగరంలో ఎక్కువౌతున్నాయి. కొందరు చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికి ఎండ తీవ్ర స్థాయిలో ఉండడంతో ప్రజల రాకపోకలు తగ్గుతూ రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

వచ్చే వారం నుంచి మరో 2 డిగ్రీలు

10 రోజులు క్రితం వరకు సుమారు 30 నుంచి 32 డిగ్రీల మధ్య నమోదైన ఉష్ణోగ్రతలు నాలుగు రోజుల నుంచి 34 నుంచి 35 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. పగటి వాతావరణంలో సైతం వారం రోజుల క్రితం వరకు గది ఉష్ణోగ్రలు సాధారణ స్థాయిలో ఉండగా నాలుగు రోజుల నుంచి ఉదయం సమయంలో కూడా ఫ్యాన్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా రానున్న వారం రోజుల్లో రోజు రోజుకూ ఎండలు పెరిగి ఉష్ణోగ్రతలు మరో రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదు కానున్నాయని వాతావరణ నిపుణులు ఇప్పటికే ప్రకటించారు. రాబోయే వారంలో ఉష్ణోగ్రతలు సుమారు 37 డిగ్రీలుగా నమోదు అవుతాయని, మార్చి నెల చివరి నుంచి 39 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఎండలు ముదురుతున్న నేపథ్యంలో పని నిమిత్తం బయటకు వెళ్లే వారు ఇప్పటి నుంచే జాగ్రత్తలు పాటించడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. దీనికి తోడు ఇంటర్మీడియట్, 10వ తరగతి, డిగ్రీ పరీక్షలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు జాగ్రత్తలు పాటించాలంటున్నారు. ఎండల్లో బయట తిరగాల్సిన వారు నీరు అధికంగా తీసుకోవాలని, రాగి జావ, కొబ్బరి నీరు వంటి ద్రవాలు తరచూ తీసుకోవాలి. ఎండలో తిరిగాల్సిన వారు గొడుగులు, లేదా టోపీలు ధరిస్తే ఉష్ణోగ్రతల నుంచి కొద్దిగా రక్షణ కలుగుతుంది. ఈ కాలంలో ఆహారం సైతం కొద్దికొద్దిగా తరచూ తీసుకోవాలి అని వైద్యులు చెబుతున్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకారం


ఎమ్మెల్యే నానిని కలిసిన డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని కోటదిబ్బ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే ఆళ్ల నాని హామీ ఇచ్చారు. మంగళవారం నానిని ఆయన క్యాంపు కార్యాలయంలో డిగ్రీ కళాశాల సీపీడీసీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీడీసీ కార్యదర్శి ఇరదల రఘుబాబు కళాశాల అభివృద్ధికి రూ.50 వేలు విరాళంగా ప్రిన్సిపాల్ జి.గిరిబాబుకు ఎమ్మెల్యే నాని చేతుల మీదుగా అందజేశారు. రఘుబాబుని నాని ప్రత్యేకంగా అభినందించారు. నానిని కలిసి వారిలో కళాశాల సీపీడీసీ సభ్యులు కె.అజయ్ కుమార్, వి.వెంకటరావు, ఎం.కృష్ణ చైతన్య, లేళ్ల వెంకటేశ్వర రావు, సామర్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చేదోడుతో టైలర్ల జీవితాలకు భరోసా

- ఏలూరులో రూ.3.50 కోట్ల లబ్ధి
- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాని


వేదికపై ఎమ్మెల్యే నానికి జ్ఞాపిక అందిస్తున్న టైలర్స్ నాయకులు

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలోని టైలర్ల సంక్షేమానికి అండగా ఉంటామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి పేదవానికీ, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు పత్తేబాదలోని టైలర్స్ సంక్షేమ భవనంలో మంగళవారం అంతర్జాతీయ టైలర్స్‌డే వేడుక ఘనంగా నిర్వహించారు. ఏలూరు నగరంలో టైలర్స్ సంక్షేమానికి విశేష కృషి చేస్తూ.. సంఘ భవనానికి ఉచితంగా స్థలాన్ని కేటాయించటం, భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే నానిని సంఘం తరఫున ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. తొలుత కుట్టు మిషన్ సృష్టికర్త విలియం హో చిత్రపటానికి నాని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకంతో టైలర్ల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ఏలూరు నియోజకవర్గంలోనే 1179 మంది పేద దర్జీలకు చేదోడు పథకంలో సుమారు రూ.3 కోట్ల 50 లక్షల ఆర్థిక సాయం జగనన్న అందించారని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో రాజకీయ అండ గల వారికి, పచ్చ తమ్ముళ్లకు మాత్రమే పథకాలు అందేవని ఆరోపించారు. సీఎం జగన్ కులం, మతం, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ న్యాయం చేస్తున్నారని వివరించారు. తన విజయానికి టైలర్లు సహకరించారని, వారి వినతి మేరకు సంక్షేమ భవనానికి స్థలం కేటాయించామని తెలిపారు. కొన్ని దుష్ట శక్తుల ప్రభావంతో ఎదురయ్యే పరిస్థితులను చేదించుకుంటూ న్యాయం చేయాలనే ఉద్దేశంతో పూర్తిస్థాయిలో కమ్యూనిటీ హాలు అసోసియేషన్‌కు చెందేలా కృషి చేశామని వివరించారు. టైలర్ల ఆశీస్సులు, మద్దతు సీఎం జగనన్నకు ఎల్లవేళలా ఉండాలని నాని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు పోతర్లంక లక్ష్మణ్, యర్రంశెట్టి సుమన్, సబ్బన శ్రీనివాస్, పార్టీ నాయకులు పారిపిరెడ్డి నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్, కిలాడి దుర్గారావు, టైలర్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు నాగేంద్ర, అధ్యక్షుడు ఎండీ హుస్సేన్, సెక్రటరీ నాగేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, నాయకులు పి.వెంకట్, అశోక్, కె.శ్రీనివాస్, దాదా, రాజు, కె.శ్రీను, రంగబాబు, సుధా, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పేదల భూములకు రక్షణ కల్పించాలి

ఏలూరు (టూటౌన్): పేదల భూములకు రక్షణ కల్పించాలని, భూముల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన అసైన్మెంట్ కమిటీని రద్దు చేయాలని వ్యవసాయ కార్మికక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఎం.జీవరత్నం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఎర్ర కాలువ మిగులు భూములను పేదలకు పంచే విషయంలో ఇరిగేషన్ అధికారులు భూస్వాములకు వత్తాసు పలుకుతున్నారని, పేద సాగుదారులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో పాతికేళ్లుగా విజయవాడకు చెందిన భూస్వాములు, బినామీలు అక్రమంగా రొయ్యలు, చేపల చెరువులుగా మార్చి పంట భూములను ధ్వంసం చేశారని మండిపడ్డారు.



సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మంగళం పాడే ప్రయత్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవి, టి.ముత్యాలమ్మ, సహాయ కార్యదర్శులు ఎస్ మహంకాళి సత్యనారాయణ, జిల్లా నాయకులు ఎల్లమ్మ, మాధవ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్ఠా మహోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక 14వ డివిజన్‌లో నిర్మించిన హనుమత్ సీతాలక్ష్మణ సమేత రామచంద్ర మూర్తి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నుంచి ప్రారంభించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన తదితర పూజలు, సాయంత్రం అంకురార్పణ, హోమాలు, రాత్రి హారతి సేవ, మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వినియోగం చేస్తారని పేర్కొన్నారు. గురువారం ఉదయం నుంచి వేద పారాయణ, గోపూజ, మంటపారాధన, ప్రతిష్ఠామూర్తులకు పంచామృత అభిషేకాలు, జలాధివాసం, సాయంత్రం హోమాలు, ప్రతిష్ఠామూర్తులకు ధాన్యాధివాసం నిర్వహిస్తారని వివరించారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు విశేష మంత్రహోమాలు, అనంతరం మహాపూర్ణాహుతి, అవభృథ స్నానం, కళావాహన కుంభ సంప్రోక్షణ, మహదాశీర్వచనం, శాంతి కల్యాణం తదితర పూజలు చేస్తామని తెలిపారు.

ఆకట్టుకుని.. ఆలోచింపజేసి


డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న సెట్‌వెల్ సీఈఓ మెహర్రాజ్


సీఆర్ఆర్ మహిళా కళాశాలలో సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థినులు


సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

ఘనంగా సైన్స్ దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని విద్యా సంస్థల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్టులు, నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెట్‌వెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ జి.గిరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి మంచి ఆవిష్కరణలు చేసే దిశగా ప్రయత్నం చేయాలని సూచించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎండీహెచ్ మెహర్రాజ్ మాట్లాడుతూ నిత్యజీవితంలో జరిగే ఘటనలను వైజ్ఞానిక దృక్పథంతో చూడడం అలవాటు చేసుకోవాలని సూచించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు, సైన్స్ ప్రదర్శనల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- సీఆర్ఆర్ మహిళా కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, లైఫ్ సైన్స్ విభాగాల హెచ్ఓడీల పర్యవేక్షణలో విద్యార్థినులు పోస్టర్ ప్రజంటేషన్, పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. వీటిని కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథ రావు, ప్రిన్సిపాల్ పి.శైలజ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అనురాధ, ఐక్యూసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి సందర్శించారు. సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని పెంపొందించడానికి ఇటువంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. ఈ ప్రాజెక్టులను వట్లూరులోని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినిలు సందర్శించి ప్రాజెక్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.
- సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్‌డే వేడుకల్లో సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలకమండలి కార్యదర్శి ఎంబీఎస్వీ ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ కళాశాల డైరెక్టర్ కేవీఆర్ఎస్ కొండయ్య రావు తదితరులు మాట్లాడారు. ముఖ్య అతిథి కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కె.ఇమ్మానియేల్ మాట్లాడుతూ సైన్స్ అధ్యయనం మార్కుల ప్రాతిపదికగా కాకుండా విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించేదిగా ఉండాలని, అది పరిశోధనలకు అంకురార్పణ కావాలని పిలుపునిచ్చారు. విద్యర్థులకు సైన్స్ క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.

సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలి

ఏలూరు రూరల్: బాలబాలికలు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని హెచ్ఎం ఎ.సర్వేశ్వరరావు అన్నారు. మంగవారం శనివారపుపేట జడ్పీ పాఠశాలలో జాతీయ సైన్స్ డే నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను చదివి ఉన్నత లక్ష్యం ఏర్పర్చుకోవాలని సూచించారు. సైన్స్ ఉపాధ్యాయురాలు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు.

చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): చేనేత రంగానికి రాష్ట్ర బడ్జెట్లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శనివారపుపేట వీవర్స్ కాలనీలో మంగళవారం చేనేత కార్మికులు ధర్నా చేశారు. వార్డు సచివాలయం అడ్మిన్‌కు సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో చేనేతపై సుమారు రెండు లక్షల మంది, చేనేత ఉప వృత్తులపై మరో రెండు లక్షల మంది జీవిస్తున్నారని తెలిపారు. చేనేత సహకార సంఘాలకు 2014 నుంచి యారన్ సబ్సిడీ, రిబేటు, పావలా వడ్డీ వీటిలో దేనికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. జీఎస్టీ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేనేతపై 46 శాతం పన్ను వేసిందని, కేంద్ర పన్నుల వల్ల రంగులు, రసాయనాల ధరలు విపరీతంగా పెరిగాయని వివరించారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి చేనేత కార్మికునికి 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు మాడా వెంకటేశ్వర రావు, గుత్తి పోతురాజు, పిచ్చుక నాగేశ్వరరావు, నార్ని నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.


అడ్మిన్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆదిశేషు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	26
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33

2 నుంచి జనార్దన స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ జనార్దన, రంగనాయక స్వామి వార్ల తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు ఈ నెల 8వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. నిత్యం ఉదయం స్వామి వారికి జనార్దన స్వామి సుప్రభాత గోష్ఠి సభ్యులచే సుప్రభాత ఏవ, నిత్యార్చన, సేవాకాలం, ఆరగింపు, మంగళాశాసనాలు, తీర్థ ప్రసాద వినియోగం చేస్తారని తెలిపారు. సాయంత్రం అర్చన, హోమాలు, సేవాకాలం, ఆరగింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. 2వ తేదీన శ్రీవారికి, తాయార్లకు క్షీరతిరుమంజనం, స్వామి వార్లను పెండ్లికుమారులను, అమ్మవార్లను పెండ్లికుమార్తెలను చేస్తారని, 3న ధ్వజారోహణం, 4న అర్చన, హోమాదులు, 5న ఎదర్కోలు ఉత్సవం, రాత్రి 7 గంటల నుంచి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 6న స్వామి వారి రథోత్సవం, 7న రాజ్యలక్ష్మి, తాయార్లకు 108 కలశ క్షీర తిరుమంజనం, 8న రాజ్యలక్ష్మి, తాయార్లకు లక్ష మల్లెల అర్చన రాత్రి స్వామి వార్లకు, తాయార్లకు పవళింపు సేవ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పోణంగిలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


పోణంగిలో విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: పోణంగిలో రామాలయం ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పండితులు వేదమంత్రాల మధ్య సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. తొలుత కార్పొరేటర్ దారపు తేజ అనూష, పెద్దలు స్వామివార్లతో పాటు విఘ్నేశ్వరుడు, సాయిబాబా విగ్రహాలను ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి


పిల్లల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఈఓ

ఏలూరు రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తే ఉత్తమ పౌరులుగా తయారవుతారని డీఎస్ఈఓ ఎస్వీ రవి సాగర్ అన్నారు. మంగళవారం ఆయన శనివారుపేట మండల పరిషత్ - 2 పాఠశాల సందర్శించారు. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని, వీటిని పిల్లలు ఉపయోగించుకునేలా చూడాలని డీఎస్ఈఓ అన్నారు. తొలుత సైన్స్, ఇంగ్లిషులో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. రికార్డులను పరిశీలించారు. డీఎస్ఈఓ వెంట ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి, హెచ్ఎం ఎస్ ఝాన్సీరాణి తదితరులు ఉన్నారు.